


దొంగలు దొరకలేదని కేసులు క్లోజ్..!

- వైసీపీ హయాంలో 50కిపైగా మూసేసిన వైనం
- స్టేషన్ల చుట్టూ తిరుగుతున్న బాధితులు
- ఇప్పుడు మేమేం చేసేదంటున్న పోలీసులు

● తిరుపతి నగరం లక్ష్మీపురానికి చెందిన జి.శశివదన కుటుంబంతో కలసి 2022 సెప్టెంబరు 22న స్వగ్రామంలో శుభ కార్యానికి బయలుదేరారు. ఇంట్లోని దాదాపు 500 గ్రాముల బంగారు నగలు, మరో 120 గ్రాముల వెండి వస్తువులు, దాదాపు రూ.2.40 లక్షల నగదు సూట్‌కేసులో ఉంచుకుని తిరుపతి ఆర్టీసీ బస్టాండుకు వచ్చారు. ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేస్తున్న సమయంలో దొంగ ఏమార్చి.. సూట్‌కేసును అపహరించుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో (421-2022) కేసు నమోదైంది.

● తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని ఎస్వీపీ కాలనీలో కాపురమున్న ఎస్వీబీసీలో జూనియర్ అసిస్టెంట్ ఎస్.విమల 2019 ఫిబ్రవరి 26న ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లారు. అక్కడ్నుంచి తన కుమారుడు చదువుతున్న విద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లారు. ఇంటికి వేసిన తాళాన్ని దుండగులు పగులగొట్టి దాదాపు రూ.2.80 లక్షల విలువైన బంగారు నగలు, వెండి వస్తువులు అపహరించుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ (89-2019) కేసు నమోదు చేశారు.

- ఈ రెండు దొంగతనాల కేసుల్లో దొంగలు దొరకలేదంటూ గతేడాది ఎన్నికల ముందే కేసు మూసేశారు. ఇలా జిల్లాలో వైసీపీ ప్రభుత్వ హయాంలో మూసేసిన కేసులు (అన్ డిటెక్టివ్) 50కి పైగా ఉన్నట్లు సమాచారం. తమకు న్యాయం జరగక బాధితులు లబోదిబోమంటున్నారు.

ఎంతో కష్టపడి.. పైసా పైసా కూడబెట్టుకున్న సొత్తు దొంగల పరమైతే ఆ బాధితుల వేదన ఎంతో? ఎప్పటికైనా పోలీసులు రికవరీ చేసిస్తారన్న ఆశతో ఏళ్ల తరబడి చూసిన వారికి.. తమ కేసులు మూసేశారని తెలియడంతో ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో దొంగతనం, దోపిడీ, బ్యాగులు ఎత్తుకెళ్లడం వంటి కేసుల్లో రికవరీపై పోలీసులు పెద్దగా దృష్టి పెట్టలేదన్న విమర్శలున్నాయి. దొంగలు దొరికినప్పుడు చూద్దాం.. అనుకుంటూ ఉదాసీనంగా ఉండిపోయారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరకు.. ప్రతి నెలా జరిగే ఎస్పీ నేర సమీక్షా సమావేశంలో సమాధానం ఎందుకు చెప్పుకోవాలని భావించారు. చివరకు దొంగలు దొరకలేదంటూ కేసులు మూసేశారు. ఇలా 2019 నుంచి 2024 వరకు.. జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో మూసేసిన కేసులు ఉండటం గమనార్హం. అప్పట్లో పోలీసు బాస్‌లు కేసులు కూడా రికవరీపై దృష్టి సారించకపోవడంతో కిందస్థాయిలోనూ అదే నిర్లక్ష్యంతో ఉన్నారన్న ఆరోపణలున్నాయి. తమ కేసులు మూసేసినా.. పలువురు బాధితులు ఇప్పటికీ పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. అప్పట్లో దొంగతనం జరిగి.. కేసులూ మూసేస్తే ఇప్పుడు మేము ఏం చేయాలంటూ కొందరు పోలీసులు బాధితులను ప్రశ్నిస్తున్నారు. ఇంతకాలం మీరేం చేస్తున్నారు. ఇప్పుడు మా వద్దకొచ్చి మొత్తుకుంటే ఎలాగంటున్నారు. దీనిపై గత సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ఓ బాధితురాలు ఎస్పీ హర్షవర్ధనరాజును కలిసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్పీ విచారించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ప్రాణం తీసిన విహార యాత్ర

- ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొన్న బైకు
- ఇద్దరు యువకుల దుర్మరణం
- మరొకరికి తీవ్రగాయాలు



భవానిప్రసాద్ (ఫైల్ ఫొటో)



ముదూరు గణేష్ (ఫైల్ ఫొటో)

దొరవారసత్రం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆదివారం సెలవు. సరదాగా గడుపుదామని ఆ ముగ్గురు మిత్రులు బైకుపై విహార యాత్రకు బయలుదేరారు. రోడ్డు ప్రమాదంలో యల్లంపాటి భవానిప్రసాద్(22), ముదూరు గణేష్(17) మృతి చెందగా, బట్టా అనిల్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషాద ఘటన దొరవారిసత్రం మండలం అక్కరపాక పెట్రోల్ బంకు ఎదురుగా జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఈ ముగ్గురిది నాయుడుపేట మండలం పుదూరు గ్రామం. భవానిప్రసాద్ చెన్నైలోని దానిష్ అహ్మద్ ఇంజనీరింగ్ కాలేజీలో సీఈసీ ఫైనలియర్ చదువుతున్నాడు. అదే కాలేజీలో గణేష్ బీటెక్ ఫస్టియర్‌లో చేరాడు. సెలవు కావడంతో సరదాగా వరదయ్యపాళెం మండలం ఉబ్బలమడుగు వెళదామనుకున్నారు. మరో స్నేహితుడు అనిల్‌తో కలిసి స్పోర్ట్స్ బైక్‌లో బయలుదేరారు. అతి వేగంగా వెళుతున్న వీరు అక్కరపాక పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి ముందు వెళుతున్న కంటైనర్ లారీని ఢీకొన్నారు. రోడ్డుపై పడిపోవడంతో తలలు పగిలి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ప్రమాదాన్ని గుర్తించి వెంటనే హైవే పోలీసుల సాయంతో 108 ద్వారా ముగ్గురినీ సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భవానిప్రసాద్, గణేష్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాలు విరిగి తీవ్రంగా గాయపడిన అనిల్‌ను ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. ఎస్ఐ అజయ్‌కుమార్ ఘటనా స్థలం పరిశీలించారు. ఇద్దరు యువకుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులది ఒకే గ్రామం కావడంతో.. వారంతా సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి చేరుకొన్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనతో ఆస్పత్రి ప్రాంగణం విషాదంగా మారింది. టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం ఆస్పత్రికి చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించారు.



గణేష్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు, బంధువులు

అండగా నిలుస్తారనుకుంటే..!

వాళ్లది నిరుపేద కుటుంబం. కష్టపడి పిల్లలను చదివిస్తున్నారు. ఉద్యోగులై కుటుంబానికి అండగా నిలుస్తారనుకున్న ఇద్దరు యువకులు.. విగతజీవులుగా మారడంతో రెండు కుటుంబాల్లో అంతులేని విషాదం నింపింది. అక్కరపాక వద్ద ప్రమాద మృతులు.. గాయపడిన యువకుడిది నాయుడుపేట మండలం పుదూరు. ఆదివారం సాయంత్రం రెండు మృతదేహాలు గ్రామానికి రావడంతో ఒక్కసారిగా రోదనలు మిన్నంటాయి.

● బాలకృష్ణ, విజయమ్మ దంపతుల కుమారుడు భవానీ ప్రసాద్. ఇతడి సోదరి జ్వాలా. బాలకృష్ణ ఆటో నడుపుకొంటూ కుటుంబాన్ని పోషించడంతో పాటు ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. ఈ సంవత్సరంతో కుమారుడి బీటెక్ పూర్తయితే.. ఉద్యోగంలో చేరి అండగా నిలుస్తాడని ఆ కుటుంబం భావించింది. ఇంతలో ఈ ప్రమాదం వారి కలలను ఛిద్రం చేసింది.

● ఇక, కుమారుడు గణేస్‌తో కలిసి సుబ్బమ్మ నాలుగేళ్ల కిందట శ్రీకాళహస్తి అగ్రహారం నుంచి పుదూరుకు వచ్చారు. కూలి పనులు చేసుకొంటూ కొడుకుని చదివిస్తున్నారు. ఈ క్రమంలో కుమారుడి మరణం ఆమెను కుంగదీసింది.

● గాయపడిన అనిల్‌దీ పేద కుటుంబమే. ఇతడి తండ్రి హోటల్‌లో పనిచేస్తున్నారు. అదే హోటల్‌లో తనూ పనికి చేరాడు అనిల్. ఇంతలో తీవ్ర గాయాలతో ఆస్పత్రికి చేరారు. ఆస్పత్రి ఖర్చులు భరించడం ఆ కుటుంబానికి తలకుమించిన భారమవుతోంది.

- నాయుడుపేట టౌన్, ఆంధ్రజ్యోతి



సభలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

రప్పా రప్పా అంటూ బెదిరించలేరు

- జగన్‌పై మంత్రి సత్యకుమార్ విమర్శ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వంలో దోచుకున్న వారిని అరెస్టు చేస్తే.. పరామర్శల పేరుతో జగన్ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు. ఆయన పర్యటనల్లో తలకాయలను తొక్కించడమే ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నారు. వీటిని ప్రశ్నిస్తే రప్పా రప్పా అంటూ బెదిరించడం ఏంటి? ఒక సిద్ధాంతం, క్రమశిక్షణ, నిబద్ధత, ధైర్యానికి మారుపేరైన బీజేపీ కార్యకర్తలను ఇలా బెదిరించలేరు' అంటూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. తిరుపతిలోని జిల్లా బీజేపీ కార్యాలయానికి ఆదివారం వచ్చిన ఆయన నూతన కార్యవర్గాన్ని అభినందించారు. అందరూ కలిసి కట్టుగా పనిచేసి పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. గత ఐదేళ్లు ఒక అవినీతికోరు ఈ రాష్ట్రాన్ని పాలించి సర్వం దోచుకున్నారని విమర్శించారు. తిరుపతిలో నకిలీ నూనె అమ్మకాలు, జీరో వ్యాపారాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత ఆహార భద్రత ప్రధాన కార్యాలయంలో 270 మంది సిబ్బందికిగాను కేవలం ఆరుగురే ఉన్నారని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఈ విభాగాన్ని విస్మరించి పరోక్షంగా అక్రమార్కులకు సహకారం అందించిందని మండిపడ్డారు. తమ ప్రభుత్వం ఆ ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టిందని, ఇకపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, కార్యదర్శి కోలా ఆనంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రారెడ్డి, కంద్రిక ఉమ, ఎస్ఎస్ఆర్ నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వరప్రసాద్, జిల్లా ఇంచార్జి పార్థసారథి, చిత్తూరు జిల్లా ఇన్చార్జి విశ్వనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాలాజీ, డాక్టర్ కదిరి నరేష్‌బాబు, డాక్టర్ మునికృష్ణయ్య పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీ పరారీ.. పట్టివేత



శ్రీనివాసన్ (ఫైల్ ఫొటో)

సత్యవేడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సబ్‌జైలు నుంచి పరారైన రిమాండ్ ఖైదీని కొద్ది గంటల్లోనే పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. నాగలాపురంలో గత నెల 20వ తేదీ రాత్రి ముస్తఫా టెక్స్‌టైల్స్‌లో దొంగలు చొరబడి వస్త్రాలు, నగదు దోచుకెళ్లారు. ఈ కేసును ఎస్ఐ సునీల్ దర్యాప్తు చేస్తున్నారు. దుకాణంలోని సీసీ పుటేజిల ఆధారంగా నిందితులు చిత్తూరు జిల్లా విజయపురం మండలం కాళీకాపురానికి చెందిన మహేష్, పిచ్చాటూరు మండలం కారూరుకు చెందిన శ్రీనివాసన్, సూర్యగా గుర్తించారు. వీరిని గతనెల 29న నారాయణరాజు కండ్రిగ సమీపాన పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం వీరిని సత్యవేడు సబ్‌జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం జైలులోని బ్యారక్‌లను శుభ్రం చేసేందుకు సూపరింటెండెంట్ కరీముల్లా ఖైదీలను బయటకు వదిలారు. ఇదే అదనుగా శ్రీనివాసన్ పోలీసుల కళ్లుగప్పి జైలు బాత్రూం గోడపైకి ఎక్కి తహసీల్దార్ కార్యాయం వెనుక వైపు దూకి పరారయ్యాడు. శ్రీనివాసన్ కనబడకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో శ్రీనివాసన్ నాగలాపురంలోని తన ప్రియురాలు ఇంట్లో ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. రిమాండ్‌లో ఉండి తప్పించుకున్నందున శ్రీనివాసన్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు జైలు సూపరింటెండెంట్ కరీంబాషా తెలిపారు. కాగా, సత్యవేడు సబ్‌జైలు నుంచి గతంలోనూ ఇద్దరు రిమాండ్ ఖైదీలు తప్పించుకోగా వారిని కూడా ఇలానే గాలించి పట్టుకున్నారు. ప్రధానంగా ఈ సబ్‌జైలు గోడలు తక్కువ ఎత్తులో ఉండడం కారణం కావచ్చని పోలీసులు భావిస్తున్నారు.



మహాసభల సందర్భంగా ర్యాలీలో నారాయణ, నాయకులు

అట్టహాసంగా సీపీఐ జిల్లా మహాసభలు

సూళ్లూరుపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో రెండు రోజుల పాటు జరిగే సీపీఐ రెండో జిల్లా మహా సభలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పార్టీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు కళాకారుల డప్పులతో ర్యాలీ నిర్వహించారు. అక్కడ జరిగిన సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ, సెప్టెంబరు 17న జరిగే జాతీయ మహాసభలను పురష్కరించుకుని జిల్లా, రాష్ట్ర స్థాయిలో మహా సభలు నిర్వహించి ప్రజల పక్షాల పోరాడేందుకు ముందుంటామన్నారు. సోంపేట భూములను రాష్ట్ర ప్రభుత్వం బడాబాబులకు అప్పగించే పద్ధతి మానుకోవాలన్నారు. ఈ నెల 11న ఆ భూములను సందర్శించనున్నట్లు తెలిపారు. కరేడు భూములను ప్రైవేట్ వారికి అప్పగిస్తే రైతుల పక్షాలన పోరాడతామన్నారు. వర్షం రావడంతో బహిరంగ సభ కేవలం 10 నిమిషాలు మాత్రమే జరిగింది. ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్సీ నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథరెడ్డి, రామానాయుడు, జయలక్ష్మి, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ప్రభాకర్, మురళి, సుధాకర్ రెడ్డి, నాగేంద్ర, ఆనంద్, చెంచమ్మ తదితరులు ఉన్నారు.

తుంబుర తీర్థానికి కలెక్టర్

తిరుమల, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని తుంబర తీర్థాన్ని ఆదివారం కలెక్టర్ వేంకటేశ్వర్ సందర్శించారు. పాపవినాశనం నుంచి ఉదయం 9 గంటలకు కాలినడకను తీర్థానికి చేరుకున్నారు. తుంబుర నాథుడిని దర్శించుకున్నారు. తిరిగి సాయంత్రం 5 గంటలకు పాపవినాశనంకు చేరుకున్నారు. ప్రతిఒక్కరు తప్పనిసరిగా సందర్శించాల్సిన ప్రాంతం తుంబుర తీర్థమన్నారు. భవిష్యత్తులో నిరంతరాయంగా ఈ తీర్థానికి భక్తులను అనుమతించేలా అటవీ శాఖ, టీటీడీతో సమన్వయం చేసుకుని సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. కలెక్టర్‌తో పాటు ఫారెస్ట్ అధికారి సెల్వం, ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఉన్నారు.



తీర్థంలో కలెక్టర్ వెంకటేశ్వర్

రేపు ఐసర్ 6వ స్నాతకోత్సవం

ఏర్పేడు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐసర్ (భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ) 6వ స్నాతకోత్సవం మంగళవారం ఐసర్‌లో జరగనుందని ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ శాంతను భట్టాచార్య తెలిపారు. ఏర్పేడు మండలం జంగాలపల్లి వద్దనున్న ఐసర్ ప్రాంగణంలో ఆదివారం ఆయన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇంద్రపీత్‌సింగ్ కోహ్లీతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఐసర్ ఏర్పడి పదేళ్లయిందన్నారు. ఈసారి స్నాతకోత్సవంలో ఐసర్‌లో కోర్సులు పూర్తి చేసిన 255 మంది విద్యార్థులకు పట్టాలను అందజేస్తామన్నారు. ముఖ్యఅతిథిగా గోదావరి బయో రిఫైనరీస్ చైర్మన్ సమీర్ సోమైయా, ఐసర్ బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్ ఝిల్లుసింగ్‌యాదవ్ హాజరవుతారన్నారు. 2015లో ఐసర్ ప్రారంభించినపుడు బీఎస్-ఎంఎస్ కోర్సును మాత్రమే ఉండేదన్నారు. ప్రస్తుతం ఎన్నో పీహెచ్‌డీ స్థాయి ప్రోగ్రామ్‌లు ప్రారంభించామన్నారు. మెల్‌బోర్న్‌యూనివర్సిటీతో ఇంటర్నేషనల్ అకాడమిక్ ప్రోగ్రాం, ఆస్ట్రేలియా, మెల్‌బోర్న్ వర్సిటీలో సంయుక్తంగా అంతర్జాతీయ రీసెర్చ్ కోర్సును త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. నాలుగేళ్ల ఈ కోర్సులో చేరే విద్యార్థులు రెండేళ్ల పాటు ఐసర్‌లో మరో రెండేళ్ల మెల్‌బోర్న్‌లో అభ్యసించాల్సి ఉంటుందన్నారు. ఈ ఏడాది నాలుగేళ్ల బ్యాచులర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఎకనామిక్ అండ్ స్టాటిస్టికల్ సైన్సెస్ (బీఎస్-ఈఎస్ఎస్), రెండేళ్ల ఎంఎస్(మాస్టర్స్ బైరీసెర్చ్) కోర్సులను ప్రారంభించనున్నామన్నారు. నేచర్ ఇండెక్స్-2025 ర్యాంకింగ్‌లో తిరుపతి ఐసర్ దేశంలోనే 33వ స్థానంలో నిలిచిందన్నారు.



మాట్లాడుతున్న ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య



అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్య క్రమాల్లో భాగంగా ఆదివారం జరిగిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. తిరుపతికి చెందిన శ్రీవిశ్వేశ్వర నృత్యాలయానికి చెందిన కళాకారులు మిథున, వర్షిక, పవిత్ర, చతుర, గగన, హేమశ్రీ, జనని, ఆద్య తాండవం నృత్య కేళి, శ్రీమన్నారాయణ, అలరుల కురియాల అలవేలుమంగ, దేవ దేవం భజే, గంధం పుయ్యరుగా, తక్కువేమి మనకు రాముడు ఒక్కడుండు వరకు, భూ శంభో, మూషిక వాహన వంటి కీర్తనలకు నృత్యం చేశారు. వారికి శిల్పారామం ఏవో సూర్యతేజ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

గ్రామాలు గజగజ

పాకాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలవంక, వల్లివేడు, పుల్లావాండ్లపల్లె, కాకర్లవారిపల్లె, మొరవపల్లె, కొండకిందపల్లి, నడింపల్లి గ్రామాల పరిసరాలలో ఏనుగుల సంచారంతో ఆయా గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం రాత్రి వల్లివేడు, చింతలవంక పరిసరాల్లోకి ఒంటరి ఏనుగు వచ్చిందని, రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని, కొమ్మిరెడ్డిగారిపల్లె క్రాస్ నుంచి కొత్తపల్లెకు వెళ్లే రోడ్డులో రాత్రి పూట ప్రయాణం చేయరాదని అటవీ సిబ్బంది అప్రమత్తం చేశారు. పుల్లావాండ్లపల్లె వెనుక వైపు ఉన్న రిజర్వు ఫారెస్టులో ఉండి రాత్రి పరిసర గ్రామాల్లోకి వచ్చే అవకాశముందని రైతులు పొలాల వద్ద బస చేయరాదని అన్నారు. చీకటి పడకముందే పొలాల నుంచి గ్రామాలకు చేరుకోవాలని సూచించారు. ఆదివారం సాయంత్రం అటవీ శాఖ సిబ్బంది గ్రామాల సరిహద్దుల్లో టపాకాయలు కాల్చారు. ఏనుగుల బెడద నుంచి పంటలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

రసవత్తరంగా దుర్యోధన వధ



యుద్ధంలో తలపడుతున్న భీమ, దుర్యోధన వేషధారులు

తిరుపతిరూరల్, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): దుర్గసముద్రం ద్రౌపదీసమేత ధర్మరాజులస్వామి వార్షిక మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ నాటిక ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలో రూపొందించిన మట్టిప్రతిమపై భీమ, దుర్యోధన వేషధారులు తలపడిన యుద్ధ సన్నివేశాలు రక్తికట్టించాయి. గంగమడుగులో దాక్కుని ఉన్న దుర్యోధనుడిని భీమసేనుడు బయటకు రప్పించడం..వారివురూ యుద్ధంలో తలపడడం రసవత్తరంగా సాగింది. చివరగా భీముడి వేషధారి దుర్యోధనుడి తొడపై గదతో కొట్టి వధించడంతో ఈ మహాభారత ఉత్సవాలు ముగిశాయి. కళాకారులు ప్రజల నుంచి ప్రశంసలు అందుకున్నారు.

● వేడుకగా అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం : ఉత్సవాల్లో భాగంగా రాత్రి 8 గంటలకు అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వందలాదిమంది భక్తులు అమ్మవారి కంకణధారణ ధరించి..వేపాకులను చేతబట్టి భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆలయ ధర్మకర్త మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి, ఉభయదారుడు మిట్టపల్లి నాదమునిరెడ్డి, వెంకటరమణారెడ్డి, దామోదర్‌రెడ్డి, దేశిరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, జయకుమార్‌యాదవ్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

చంద్రగిరి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తేనే రాజకీయ నాయకుడిగా గుర్తింపు వస్తుందని కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుబ్రమణ్యంయాదవ్ అన్నారు. బీజేపీ చంద్రగిరి మండల అధ్యక్షుడు కాకిమాను మునిరాజ ఆధ్వర్యంలో ఆదివారం చంద్రగిరి బాలికల బీసీ సంక్షేమ వసతి గృహంలో పరిశుభ్రత, విద్య విలువపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన సుబ్రమణ్యం యాదవ్ మాట్లాడుతూ మునిరాజ విద్యార్థినులకు సాయం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం 350 మంది విద్యార్థినులకు సోపులు, చాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మునిగంగిరెడ్డి, మహిళా మోర్చా మండల ఉపాధ్యక్షురాలు ప్రశాంతి, మండల ఉపాధ్యక్షులు టీఏవీ ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి ఇందుశేఖర్, మండల కార్యదర్శి చంద్రకళ పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



కేక్ కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

చంద్రగిరి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1974-75 సంవత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలిశారు. నాగయ్యగారిపల్లెలోని మామిడితోటలో కలిసి ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. 50 సంవత్సరాల తర్వాత కలిసినందుకు కేక్ కట్ చేసి, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వివిధ కారణాలతో మరణించిన సహచర విద్యార్థులకు సంతాపం తెలిపారు. 50 సంవత్సరాల తర్వాత కలవడం ఆనందంగా ఉందన్నారు. తమతోపాటు విద్యనభ్యసించిన పేద సహచరులకు సహాయ సహకా రాలు అందించాలని, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, సంద్ర సిద్ధయ్య నాయుడు, చంద్రబాబు నాయుడు, అప్పయ్య శాస్త్రి, పార్లపల్లి పరందామ రెడ్డి, సీనియర్ పాత్రికేయుడు తెలగంశెట్టి రాజుగోపాల్ పాల్గొన్నారు.

తిరుమలలో మఠాలకు నోటీసులివ్వడం సరికాదు: వైసీపీ

తిరుపతి(జీవకోన), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని మఠాలకు పోలీసులు నోటీసులు జారీ చేయడం సరికాదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వైసీపీ నేతలు ఉదయ్ వంశీ, వాసుదేవ యాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు.

చంద్రగిరి

జాతీయ రహదారి పక్కనే ఉన్న డాలర్స్ కాలనీ రోడ్డు



డాలర్స్ కాలనీలో ఆకతాయిల ఆగడాలు

● ఆ మార్గంలో వెళ్లాలంటే భయపడుతున్న ప్రజలు

చంద్రగిరి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పట్టణానికి అతి దగ్గర్లో జాతీయ రహదారి పక్కనే డాలర్స్, ఇందిరమ్మ కాలనీలు ఉన్నాయి. రాయలపురం పంచాయతీ పరిధిలో డాలర్స్ కాలనీ ఉంటుంది. ఇందిరమ్మ కాలనీ చంద్రగిరి పంచాయతీలో ఉంటుంది. అయితే ఇందిరమ్మ కాలనీ వాసులు డాలర్స్ కాలనీ మీదుగా జాతీయ రహదారికి, చంద్రగిరి పట్టణానికి చేరుకోవాల్సి ఉంటుంది. డాలర్స్ కాలనీలో కొన్నిప్లాట్లు ఖాళీగా ఉండటం, వీధిలైట్లు లేకపోవడంతో సాయంత్రమైతే రోడ్డుపైనే మందుబాబులు గుంపులు, గుంపులుగా కూర్చుని మద్యం తాగుతున్నారు. ఆకతాయిలు బైక్‌లపై చక్కెర్లు కొడుతున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి వరకు విద్యార్థులు, మహిళలు జాతీయ రహదారి నుంచి డాలర్స్ కాలనీ మీదుగా ఇందిరమ్మ కాలనీకి చేరుకోవాల్సి వస్తోంది. ఆకతాయిల ఆగడాల కారణంగా వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితం ఓ మహిళ ఒంటరిగా వస్తుండటంతో ఆకతాయిలు ఆమెను వెంబడించి, భయభ్రాంతులకు గురిచేశారు. డాలర్స్ కాలనీలో పగలు, రాత్రి పోలీస్ గస్తీ నిర్వహించాలని, వీధిలైట్లు ఏర్పాటు ప్రజలు కోరుతున్నారు.



పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదు..

డాలర్స్ కాలనీలో వీధిలైట్లు వేయాలని రాయలపురం పంచాయతీ అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదు. రాత్రిపూట చంద్రగిరి నుంచి డాలర్స్ కాలనీ, ఇందిరమ్మ కాలనీకి వెళ్లాలంటే చాలా ఇబ్బందిపడాల్సి వస్తోంది. మహిళలకు రక్షణ లేకుండా పోతోంది.

- బాలాజీ, ఇందిరమ్మ కాలనీ

గస్తీ నిర్వహించాలి..

రాత్రీపగలు తేడా లేకుండా మందుబాబులు గుంపులు, గుంపులుగా చేరి మద్యం తాగుతున్నారు. మహిళలు ఒంటరిగా వెళ్లాలంటే భయపడుతున్నారు. డాలర్స్, ఇందిరమ్మ కాలనీలలో పోలీసులు గస్తీ నిర్వహించాలి.

- కుమారి, ఇందిరమ్మ కాలనీ



గుర్తుకొస్తున్నాయి..

● పూర్వ విద్యార్థుల కలయిక

తిరుపతి రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లె జెడ్పీ హైస్కూల్‌లో 1985-86బ్యాచ్‌కి చెందిన విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం పైడిపల్లెలోని మామిడితోటలో నిర్వహించారు. పలువురు పూర్వ విద్యార్థులు హాజరై గతస్మృతులు, మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన టీచర్లు కొంగర సుధాకర్‌నాయుడు, సి.శివలక్ష్మిని సత్కరించి పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా టీచర్లు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల కిందట పాఠశాల విద్యను పూర్తిచేసినా ఇప్పటికీ గుర్తుంచుకుని ఆహ్వానిచడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఏటా స్నేహితుల దినోత్సవం రోజున ఈ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతకముందు తమబ్యాచ్‌లో చదివి మరణించిన పలువురు విద్యార్థులకు సంతాపం వ్యక్తం చేశారు. గుత్తా కోటేశ్వరనాయుడు, జానకిరామిరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, కొత్తపాటి మునీశ్వరరెడ్డి, మురళినాయుడు, జ్యోతి, హేమలత, బీవీ భాస్కర్‌రెడ్డి, లక్ష్మి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లతో 1985-86బ్యాచ్‌కి చెందిన పూర్వవిద్యార్థులు



నగరంలో మోస్తరు వర్షం



తిరుపతి అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా ఉక్కపోత తీవ్రంగా ఉంది. ఆదివారం ఉన్నట్టుండి పెద్ద వర్షం ప్రారంభమై.. కాసేపటికే ఆగిపోయింది. కాసేపు వర్షానికే ప్రజలు తడిసిముద్దయ్యారు.

నెల రోజుల్లో 18 కిలోల గంజాయి సీజ్

● 1567 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ● బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై 1476 కేసులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా జూలైలో పోలీసులు తీసుకున్న చర్యలపై ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆ ప్రకారం.. గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వారిపై నిఘా వుంచి 18 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. 1567 మంది రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి మంచి దారిలో నడవాలని సూచించారు. బహిరంగంగా మద్యం తాగుతున్న దాదాపు 1476 మందిపై కేసులు నమోదు చేశారు. బహిరంగంగా మద్యం తాగే 96 ప్రదేశాలను గుర్తించి.. శుభ్రం చేసి భవిష్యత్తులో అక్కడ మద్యం తాగడానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 258 మందిపై కేసులు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రూ.10,000 చొప్పున జరిమానా విధించారు. మోటారు వాహనాల చట్టం పరిధిలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలపై 13,489 కేసులు నమోదయ్యాయి. డ్రోన్ ద్వారా 116 ఆపరేషన్లు చేసి నేరాలు కట్టడికి చర్యలు తీసుకున్నారు. 100 గ్రామాల్లో పోలీసులు పల్లె నిద్ర చేశారు. అనధికారికంగా వాహనాలపై వున్న 302 పోలీసు, ప్రెస్ స్టిక్కర్లు తొలగించారు. 396 హోం స్టేలు తనిఖీలు చేసి అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న మూడింటిని సీజ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి రికార్డుల్లేని దాదాపు 62 వాహనాలు సీజ్ చేశారు.

లగేజీ వ్యాను బోల్తా

● రోడ్డు పాలైన టమోటాలు ● రైతుకు స్వల్పగాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం మోదుగులపల్లె మార్గంలో టమోటాలను తరలిస్తున్న లగేజీ వ్యాను అదుపు తప్పి బోల్తాపడటంతో రైతుకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా.. మోదుగులపల్లె పంచాయతీ కంటేపల్లెకు చెందిన రైతు కుమార్ తన టమోటాలను పుంగనూరు మార్కెట్‌కు లగేజీ వ్యానులో తరలిస్తుండగా కంటేపల్లె క్రాస్ వద్ద వాహనం అదుపుతప్పి బోల్తాపడింది.ఈ ప్రమాదంలో రైతుకు స్వల్ప గాయాలవగా, వాహనంలోని టమోటాలన్నీ రోడ్డుపాలయ్యాయి. దీంతో సుమారు రూ.లక్ష నష్టం జరిగినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.



లగేజీ వ్యాను బోల్తా పడటంతో రోడ్డు పాలైన టమోటాలు





భక్తులతో కిక్కిరిసిన 'బోయకొండ'

చౌడేపల్లె, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ అర్చకులు వేకువజామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకాలు చేశారు. అమ్మవారికి కృష్ణగిరికి చెందిన భక్తుడు అరుణ్‌కుమార్ దంపతులు నెమలి పింఛాలు, రూ.5 కాయిన్లతో పూలహారాన్ని బహూకరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

కరీంనగర్‌లో శ్రీవారి ఆలయం కోసం ఏపీ సీఎంను కలుస్తాం

● ఇప్పుడు ప్రసాదాలు బాగున్నాయన్న తెలంగాణ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



తిరుమల, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ తర్వాత అత్యంత పెద్ద నగరమైన కరీంనగర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని కలుస్తామని ఆ రాష్ట్ర ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రతిమూడు నెలలకోసారి శ్రీవారిని దర్శించుకోవడం తనకు అనవాయితీ ఉన్నారు. ప్రస్తుతం ప్రసాదాలు చాలా రుచికరంగా మారాయన్నారు. భక్తులకు ఎంతో నమ్మకం కలిగేలా ప్రసాదాలను తయారు చేస్తున్నార న్నారు. కాగా, కరీంనగర్‌లో శ్రీవారి ఆలయం నిర్మాణం కోసం మాజీ సీఎం కేసీఆర్ 10 ఎకరాల భూమిని కేటాయించారన్నారు. కానీ రెండేళ్లు గడుస్తున్న ఎలాంటి పనులు ప్రారంభం కాలేదన్నారు. ఈ అంశంపై టీటీడీ అదనపు ఈవోతో కూడా మాట్లాడినట్టు తెలిపారు.

మృతుడి వివరాలు తెలిస్తే చెప్పండి



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మృతి చెందిన ఈ వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్వీయూ క్యాంపస్ పోలీసులు కోరారు. 'ఈ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం ఉదయం పది గంటలకు తిరుపతిలోని బండారు ఆంజనేయ స్వామి గుడి వీధిలోని ఖాళీ స్థలంలో ఉంది. అతడి పేరు తెలియదు. కుడిచేతిపై డ్రాగన్ టాటూ ఉంది. 40-45 ఏళ్లు ఉండొచ్చు. ఎత్తు 5.6 అడుగులు. బ్లూ జీన్స్ ప్యాంట్, లైట్ స్కై బ్లూకలర్ చొక్కా వేసుకుని ఉన్నాడు. ఇతడి గురించి ఏ సమాచారం తెలిసినా 94910 74524, 0877 2289009 నెంబర్లలో తెలియజేయండి' అని కోరారు.

రాష్ట్రస్థాయి అవార్డుకు ఆరు సింగిల్‌విండోల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆప్కాబ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయవాడ గవర్నర్‌పేటలోని మాకినేని బసవయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఉదయం 10 గంటలకు రాష్ట్రస్థాయి కార్యక్రమం జరగనుంది. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో ఉత్తమ పనితీరు చూపిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(సింగిల్ విండోల)కు అవార్డులు ప్రకటించింది. ఇందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన మదనపల్లె, వాయల్పాడు, రేణిగుంట, కోసలనగరం, జీడీనెల్లూరు, ఏర్పేడు విండోలు ఎంపికయ్యాయి. అవార్డుల స్వీకరణ కోసం ఆయా విండోల చైర్మన్లు, సీఈవోలు ఆదివారం విజయవాడకు బయల్దేరి వెళ్లారు. కాగా, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి, సీఈవో శంకర్‌బాబులకు కూడా కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానం అందింది.

వరసిద్ధుడి సేవలో పీసీసీఎఫ్

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని ఆదివారం రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్ ఎస్ఎస్ శ్రీధర్ దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐవీఆర్ కృష్ణారావు కూడా స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తజనసంద్రం.. పాలరేవుగడ్డ

ఆలయం వద్ద భక్తజన సందోహం



● కోలాహలంగా ఆడి పదినెట్టు వేడుకలు

రామకుప్పం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బల్ల పంచాయతీ పాలరేవుగడ్డ సుబ్రహ్మణ్య క్షేత్రంలో ఆదివారం ఆడి పదినెట్టు వేడుకలు కోలాహలంగా జరిగాయి. ఆలయంలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే వేలాదిగా భక్తులు తరలిరావడంతో పాలరేవుగడ్డ జనసంద్రంగా మారిపోయింది. వందలాది మంది భక్తులు కుండ కావళ్లు, నెమలి కావళ్లు, వీపుతేర్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు వీపులకు కొక్కీలు తగిలించుకుని క్రేన్లకు వేలాడుతూ, దవళ్లకు శూలాలు, శరీరాలకు నిమ్మకాయలు గుచ్చుకుని ఆలయానికి చేరుకుని స్వామివారికి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాదాలను ఆలయ నిర్వాహకులు పంపిణీ చేశారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, నేతలు రామ్మూర్తి, గుర్రప్ప, నాగభూషణం, జయశంకర్, సత్తి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూశారు.



వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి



వీపునకు కొక్కీలు తగిలించుకుని క్రేన్‌కు వేలాడుతున్న భక్తుడు

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం : **రూ.4.28 కోట్లు**
శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : **82,367**
తలనీలాలు సమర్పించినవారు : **31,420**

తిరుమలలో కర్ణాటక గవర్నర్


థావర్ చంద్ గెహ్లాట్‌కు స్వాగతం పలుకుతున్న టీటీడీ రిసెప్షన్ ఓఎస్డీ సత్రేనాయక్

తిరుమల, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఆదివారం తిరుమలకు వచ్చారు. పద్మావతి అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ ఓఎస్డీ సత్రేనాయక్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు. కాగా, థావర్ చంద్ గెహ్లాట్ సోమవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

15న సామూహిక వరలక్ష్మీవ్రతం


మాట్లాడుతున్న జిల్లా బ్రాహ్మణ సేవా సమితి నిర్వాహకులు

తిరుపతి(జీవకోన), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నరసింహాచార్య, బాబుస్వామి, తులసీ రామశర్మ తెలిపారు. కరకంబాడీ రోడ్డులోని అట్లాంటిస్ స్కూల్ పక్కన ఉన్న పుష్పగిరి మఠంలో సాయంత్రం 4గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ శ్రావణమాసంలో వరలక్ష్మీవ్రతం ఎంతో ప్రాశస్త్యమైందని, అందరికీ లక్ష్మీ కటాక్షం కలగాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 9441661212, 7659927777, 9949339851, 9550595916, 9701553046, 9849120030లను సంప్రదించాలన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ అపర్ణ

తిరుపతి, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి) : తిరుపతి భవానీనగర్‌లో ఆర్‌కే క్లినిక్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. జనరల్ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ జె.అపర్ణ నేతృత్వంలో షుగర్ పరీక్షలు, ఎముకల సాంద్రత పరీక్ష, పెరిఫెరల్ న్యూరోపతి, ఇతర రక్తపరీక్షలను ఉచితంగా చేశారు. రోగులకు అవసరమైన వైద్య సలహాలు అందించి, చికిత్స చేశారు. జనరల్ మెడిసిన్, డయాబెటాలజీ, ల్యాపరోస్కోపిక్ జనరల్ సర్జరీ వైద్య సేవలు ఆర్కే క్లినిక్‌లో అందుబాటులో ఉంటాయని డాక్టర్ అపర్ణ ఈ సందర్భంగా తెలిపారు.

తైక్వాండో పోటీలపై కార్యాచరణ


సమావేశంలో తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది కాలంలో నిర్వహించతలపెట్టిన తైక్వాండో పోటీలపై ఉమ్మడి చిత్తూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిపట్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో తైక్వాండో క్రీడాభివృద్ధి, క్రీడాకారులకు శిక్షణ, సెమినార్స్ నిర్వహణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ధనంజయులు, ట్రెజరర్ శ్రీనివాసులు, శంకర్, వాసుదేవాచారి, రవి, వెంకటరమణ, సురేష్, సంతోష్, లోకేశ్, గౌతమ్, పృథ్వీ, విజయ్, అనిల్ పాల్గొన్నారు.

న్యూ ఇందిరానగర్‌లో వైద్య శిబిరం



తిరుపతి(జీవకోన), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని 13వ డివిజన్ న్యూ ఇందిరానగర్‌లో సాధన మహిళ అభ్యుదయ సేవా సంఘం, ఎంఎస్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ ఆంజనేయులు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ మెంబర్ రావూరి ప్రసాద్ హాజరయ్యారు. స్థానికులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మహిళా సంఘం అధ్యక్షురాలు సరళ, కార్యదర్శి ఝాన్సీ పాల్గొన్నారు.

అ 'పూర్వ'కలయిక



స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎస్వీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో కలిశారు. చదువుకునే రోజుల్లో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

రేపటి నుంచి జిల్లాస్థాయి క్రీడల ఎంపిక పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం, హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నుంచి వివిధ క్రీడాంశాల జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, హాకీ, వాలీబాల్ క్రీడలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఎస్వీయూ, శ్రీనివాస క్రీడా సముదాయం, ఎస్వీ ఆర్ట్స్ హాకీ, ఓల్డ్ ఏజీఎస్ కాలేజీ గ్రౌండ్‌లలో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. 22 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండి ఆధార్, ఏదైనా గుర్తింపు కార్డుతో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ హిందూజ(7095636012), కబడ్డీ, ఖోఖో గోపి(9059606346), వాలీబాల్, బాక్సింగ్ యహజాజ్(9177234298), బాస్కెట్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్ సాయిసుమతి(7780124037), ఆర్చరీ - వినోద్ (8919295921), హాకీ - శ్రీలక్ష్మీకరుణ (7032018113)లను సంప్రదించాలని కోరారు.

తొట్టంబేడు ఎస్ఐ వీఆర్‌కు

శ్రీకాళహస్తి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు ఎస్ఐ రామాంజనేయులును వీఆర్‌కు పంపారు. సంబంధం లేని కేసుల్లో విచారణ చేస్తున్నారంటూ ఈయనపై శుక్రవారం అభియోగాలు వచ్చాయి. ఈయన వ్యవహార శైలిపై పలువురు టీడీపీ నేతలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం అధికారులు విచారణ చేపట్టారు. శనివారం రాత్రి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ వీఆర్‌కు పంపుతూ నిర్ణయం తీసుకున్నారు.

సంస్కృత వర్సిటీలో ద్వాదశ కలశ స్థాపన

- పలువురు ఆచార్యులకు సన్మానం


ఆచార్యులను సన్మానిస్తున్న సాధు భద్రేశస్వామి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీలోని అక్షర పురుషోత్తమ మండపంలో ద్వాదశ కలశ స్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. మూడు రోజుల పాటు నిర్వహించే భాషోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రుద్ర ఏకాదశి అనే వైదిక కార్యక్రమాన్ని చేపట్టారు. అధ్యాపకులతో శాస్త్రీయ చర్చాగోష్ఠి నిర్వహించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. సంప్రదాయ శోధ సంస్థానం అధ్యక్షుడు స్వామి నారాయణ నేతృత్వంలో ఈ చర్చాగోష్ఠి సాగింది. ప్రొఫెసర్ గణపతి భట్, ఉత్కల పీఠం డైరెక్టర్ జ్ఞానరంజన్ పాండా తదితరులు పాల్గొన్నారు. సాధు భద్రేశ స్వామి చేతుల మీదుగా దర్శన సంకాయ డీన్ విష్ణుభట్టాచార్యులు, పరమాచార్య గురుకుల కేంద్ర డైరెక్టర్ గణపతిభట్, ద్వైత, అద్వైత వేదాంత విభాగాధ్యక్షుడు నారాయణ, సతీష, ఆగమ విభాగ ప్రొఫెసర్లు రంగరామానుజాచార్యులు, నాగరాజు భట్, యోగా విభాగాధ్యక్షుడు డాక్టర్ తపన్‌కుమార్, డాక్టర్ షిండే మనోజ్ అంగద్‌ను సన్మానించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



చంద్రగిరి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం పాడి రైతులకు వరమని ప్రకృతి వ్యవసాయదారుడు కొమ్మినేని దామోదరనాయుడు అన్నారు. ఆదివారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద పాడి రైతులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా వచ్చే రూ.20వేలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం


1983-84 బ్యాచ్ పదవతరగతి విద్యార్థులు

తిరుపతి(విద్య), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ 1983-84 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం వేడుకగా జరుపుకున్నారు. ఓ హోటల్ వేదికగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. పాత స్మృతులను గుర్తు చేసుకుంటూ... ఒకరినొకరు ఆటపట్టించు కుంటూ ఉల్లాసంగా గడిపారు. 42 ఏళ్ల తర్వాత తమ చిన్ననాటి స్నేహితులను కలుసుకోవడంతో కొందరు భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కందారపు మురళి, ప్రధాన కార్యదర్శి కె.లోకేశ్వర్ వర్మ, పగడాల అర్జున్, ఆర్ఆర్ శ్రీనివాస్, జయచంద్ర, శ్రీనివాసులు, సుబ్బారావు, రమేష్, సుబ్రహ్మణ్యం, మన్నేపల్లి బాలకృష్ణ, కందారపు సురేంద్ర, బీవీ రాయ్, ముని, చంద్రమౌళి, చెంగయ్య, గురుమూర్తి, గిరి, బాల, శేఖర్‌రాజు, శ్రీనివాస్, ఉమ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది ఎర్రచందనం దుంగల స్వాధీనం: ఒకరి అరెస్టు


స్మగ్లర్‌ను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఖాజీపేట సమీపంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. 9 ఎర్రచందనం దుంగలను, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం ఎఫ్‌బీవో లింగానాయక్‌తో కలిసి శనివారం రాత్రి నుంచి ఖాజీ పేట పరిధిలో కూంబింగ్ నిర్వహించారు. పత్తూరు సమాధులు చేరుకునే సరికి ఒక కారులో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు లోడ్‌చేస్తూ పోలీసుల కంటపడ్డారు. చుట్టుముట్టే ప్రయత్నం చేయగా ఒకరు దొరికారు. మిగిలిన వారు పారిపోయారు. అతను తమిళనాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కారులో లోడ్ చేసిన 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాహనంతో సహా దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యంరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగదు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

తిరుపతి(విద్య), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తీసుకొచ్చి ఇబ్బంది పెట్టడం తగదని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. యూటీఎఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం తిరుపతిలోని ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యా బోధనకు ఆటంకంగా ఉన్న అన్ని యాప్‌లను రద్దు చేయాలన్నారు. యాప్‌ల వల్ల బోధన సక్రమంగా జరగడం లేదని విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టదన్నట్లు వ్యవహరించడం సరికాదన్నారు. నాణ్యమైన విద్య అందించడానికే విద్యారంగ సంస్కరణలు అని చెప్పారని, కానీ అవి పాఠశాలలను, ఉపాధ్యాయుల సంఖ్యను కుదించడానికే ఉపయోగపడుతున్నాయన్నారు. కర్మయోగి, పీ4 ద్వారా పిల్లలను దత్తత తీసుకోవాలని టీచర్లను ఒత్తిడి చేయడం ఏంటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రెండు నెలలుగా ఉపాధ్యాయులకు జీతాలు అందించకపోవడం బాధాకరమన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను తక్షణం నియమించాలని, నాలుగు డీఏలను, ఇతర బకాయిలను చెల్లించాలని కోరారు. సంఘం గౌరవాధ్యక్షుడు దండు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా కార్యదర్శులు సురేష్, పద్మజ, రాష్ట్ర కౌన్సిలర్ నాగరాజు పాల్గొన్నారు.

శివకుమార్‌కు ఘన సన్మానం


శివకుమార్ దంపతులను సన్మానిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఎస్వీయూ సెనేట్ హాల్లో ఓఆర్ఐ - శ్రీకృష్ణదేవరాయ సత్సంగ్ సంయుక్తంగా శివకుమార్ దంపతులను ఆదివారం సన్మానించాయి. ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, అవధాని మేడసాని మోహన్ తదితరులు పాల్గొని బాల సాహిత్యానికి గంగిశెట్టి చేసిన కృషిని కొనియాడారు. ఆయన యూనివర్సిటీ పూర్వ విద్యార్థి కావడం గర్వకారణమన్నారు. ఓఆర్ఐ డైరెక్టర్ వీసీ వేంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. డాక్టర్ తొండాటి రాజశేఖర్ వందన సమర్పణ చేశారు. రిటైర్డు ప్రొఫెసర్లు చిట్రాజు గోవిందరాజు, జక్కంపూడి మునిరత్నం, కోసూరి దామోదర నాయుడు, ఆనందనాయుడు, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, రిటైర్డు లైబ్రేరియన్ వల్లువార్ షణ్ముగం, ఏనుగు అంకమనాయుడు, గంగిశెట్టి శివకుమార్ సాహిత్యంపై పీహెచ్‌డీ చేసిన డాక్టర్ రామలింగయ్య, రచయితలు రాసాని, జిల్లేళ్ల బాలాజీ, కృష్ణస్వామిరాజు, మూరిశెట్టి గోవిందు, తోట వెంకటేశ్వర్లు, మల్లేశ్వరరావు, పేరూరు బాలసుబ్రమణ్యం, డీన్లు ప్రొఫెసర్ నరసింహ, బాలాజీ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తిరుపతి(విద్య), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్పీజేఎన్ఎం హైస్కూల్ 1984-85 బ్యాచ్ విద్యార్థులు పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. వీరు 16 సంవత్సరాల క్రితం యునైటెడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ (యూఎఫ్ఏ)ను స్థాపించారు. అప్పటి నుంచి ఏటా పాఠశాల వేదికగా కలుస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా పాఠశాల వేదికగా కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్వీయూ ఉద్యోగి మణి, రత్నప్రభాకర్, టీటీడీ ఉద్యోగి ఎంఎన్ మణి, అడ్వకేట్ ముల్లంగి రామకృష్ణ, బాలమురళీకృష్ణ, మోహన్, శ్రీను, శ్రీనాథ్, పురందర్, లీలామనోహర్ తదితర 100 మంది కలిశారు.


ఎస్పీజేఎన్ఎం హైస్కూల్ 1984-85 బ్యాచ్ విద్యార్థులు

ప్రజాస్వామ్య వ్యతిరేక ఉత్తర్వులు రద్దు చేయాలి

- పాఠశాలల్లోకి ప్రవేశ నిషేధం ఉత్తర్వుల ప్రతుల దహనం


ప్రతులను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుపతి(విద్య), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోకి అనధికార వ్యక్తులు, రాజకీయ, విద్యార్థి సంఘాల నేతలు ప్రవేశించరాదంటూ విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ముత్యాలరెడ్డిపల్లె దండు మార్చ్ కూడలిలో ఆదివారం జీవో ప్రతులను దహనం చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ అది విద్యార్థుల హక్కులను కాలరాసే జీవోగా అభివర్ణించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించాల్సిందిపోయి వాటిని కాలరాయడం ఏంటని ప్రశ్నించారు. జిల్లా కార్యదర్శి భగత్‌రవి మాట్లాడుతూ విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం పనిచేసే విద్యార్థి సంఘాలను అడ్డుకోవడం చేతగాని తనమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, ఉపాధ్యక్షులు అశోక్, వినోద్, తేజ, జిల్లా సహాయ కార్యదర్శులు ఉమేష్, రమణ, వీరేష్ పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమానికి పెద్దపీట

- బీఎంఎస్ ప్రపంచంలోనే అతిపెద్ద కార్మిక సంఘం
- వార్షికోత్సవం ముగింపు సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్


జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో సత్యకుమార్ యాదవ్ తదితరులు

తిరుపతి (ఉపాధ్యాయనగర్), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమాన్ని ఆకాంక్షించి పెద్దపీట వేసేది కేంద్రంలోని ఒక్క బీజేపీ మాత్రమేనని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక కచ్చపి ఆడిటోరియంలో జరిగిన బీజేపీ అనుబంధ కార్మిక సంఘం భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) వార్షికోత్సవ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులకు మేలు చేయాలనే తలంపుతో 39 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా కేంద్ర ప్రభుత్వం విభజించిందని వివరించారు. ఒక స్థిరమైన సిద్ధాంతం ఆధారంగా పనిచేసే కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశంలో కార్మికులతోపాటు అన్ని వర్గాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయన్నారు. బీఎంఎస్ అఖిల భారత ఉపాధ్యక్షుడు సుంకరి మల్లేశం మాట్లాడుతూ 1955లో శూన్యంతో ఏర్పడిన బీఎంఎస్ 1989 నాటికి దేశంలోనే అతిపెద్ద యూనియన్‌గా ఎదిగిందన్నారు. ఆ స్థానాన్ని ఇప్పటికీ కొనసాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రముఖ్ యుగంధర్, బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రఘురాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి బిల్లే శీనప్ప, జిల్లా కన్వీనర్ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కనువిందు చేసిన కూచిపూడి నృత్యం



తిరుమల, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం ముందున్న నాద నీరాజనం వేదికపై ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులకు కనువిందు చేసింది. తిరుపతికి చెందిన కుమారి భానుజ బృందం ఈ ప్రదర్శన ఇచ్చింది. శ్రీమన్నారాయణ, అన్ని మంత్రములు.., వంటి అన్నమయ్య కీర్తనలకు వీరి బృందం అద్భుత నృత్య భంగిమలతో చూపరులను ఆకట్టుకున్నారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం కుమార్తె శ్రేయ జోషీ తన ప్రదర్శనతో భక్తులను ఆకట్టుకున్నారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆలయ పేష్కార్ రామకృష్ణ పాల్గొన్నారు.

బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడిగా సతీష్‌కుమార్



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): భారతీయ మజ్దూర్ సంఘ్ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా ఆకుల సతీష్‌కుమార్ నియమితులయ్యారు. స్థానిక కచ్చపి ఆడిటోరియంలో సంఘ్ 70వ వార్షికోత్సవం ముగింపు సభ ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథ్ జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. ఆకుల సతీష్‌కుమార్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక కావడం పట్ల పలువురు అభినందించారు.

అలరించిన దుర్యోధన వధ



భాకరాపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆఖరి ఘట్టం దుర్యోధన వధ కార్యక్రమం ఆద్యంతం ప్రేక్షకులను అలరించింది. దుర్యోధన, భీమ వేషధారులు మహాభారత ఘట్టాలను వివరించారు. కురుక్షేత్ర యుద్ధంలో కౌరవులందరూ మరణించిన తర్వాత చివరగా మిగిలిన దుర్యోధనుడు నీటి మడుగులో దాక్కుని శివుడి గురించి తపస్సు చేస్తుండగా అతడిని భీముడు బయటకు రప్పించే సన్నివేశం ఆకట్టుకుంది. ఇరువురూ వీరోచితంగా పోరాడగా చివరకు దుర్యోధన తొడను భీముడు విరచడంతో అతను మరణిస్తాడు. దీంతో మహాభారత యుద్ధం ముగిసింది. అనంతరం రాత్రి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు.

వాకాడులో కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న వాహనాలతో ఎస్ఐలు నాగబాబు, బలరామయ్య, పోలీసు సిబ్బంది

వాకాడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వాకాడు బీసీ కాలనీలో ఆదివారం ఎస్ఐ నాగబాబు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ చేపట్టారు. వేకువజాము నుంచి కాలనీవాసులను బయటకు వెళ్లనివ్వకుండా పోలీసులు నిఘా పెట్టారు. సుమారు 400 ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన ధృవపత్రాలు లేని 7 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగబాబు మాట్లాడుతూ కాలనీలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరించినా, మత్తు పదార్థాలు విక్రయించినా, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిట్టమూరు ఎస్ఐ బలరామయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కటాలమ్మకు పూజలు



కటాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పాశిం, తానంకి నానాజీ

గూడూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో గల కటాలమ్మ ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతైన కటాలమ్మను ప్రతి ఆదివారం సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు దర్శించుకుని ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకుంటుటారన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో వసతులు మెరుగుకు చర్యలు చేపడుతామన్నారు. ఆయన వెంట పెంచలకోన ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తానంకి నానాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లూరు కరుణాకర్‌రెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులరెడ్డి, మట్టం మురళి, పట్టాభిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎంఆర్‌సీ క్లబ్ స్వర్ణోత్సవాలు



క్లబ్ వ్యవస్థాపక చైర్మన్ బద్దెపూడికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నెలవల, మాజీ ఎమ్మెల్సీ వాకాటి తదితరులు

సూళ్లూరుపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో వైఎంఆర్‌సీ క్లబ్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం స్వర్ణోత్సవ సంబరాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి కేక్‌కట్ చేశారు. వైఎంఆర్‌సీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దేవారెడ్డి సుధాకర్ రెడ్డి, తన్నీరు శేషగిరిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా వ్యవస్థాపకులు బద్దెపూడి వేణుగోపాలరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాళంగి ప్రభాకర్, ఆరణి విజయభాస్కర్ రెడ్డి, తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, ఏజీ కిషోర్, మాదరపాక బాలసుబ్రహ్మణ్యం, నూతలపాటి శ్రీనివాసులు, అలవల శ్రీనివాసులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో వర్షం



పోలీసుస్టేషన్ పక్కన ఇళ్ల మధ్య పొంగి ప్రవహిస్తున్న మురుగునీరు

సూళ్లూరుపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచే కారుమబ్బులు కమ్ముకుని చల్లటి వాతావరణం నెలకొంది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో ఉక్కపోత ఎక్కువైంది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై దాదాపు గంటకుపైగా గాలులతో కూడిన జల్లులు పడ్డాయి. పట్టణంలో గణపతి నగర్, జీఎన్‌టీ రోడ్డులో వర్షపునీటికి మురుగు తోడై రోడ్లపైకి పొంగింది. పిండిపాలెం మలుపు వద్ద జాతీయ రహదారి పక్కన తవ్వేసిన గుంతలో భారీగా వర్షపునీరు నిలిచింది.

తడలో మోస్తరు వర్షం

తడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తడలో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమి ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరయ్యారు. సాయంత్రానికి నల్లటి మేఘాలు కమ్ముకుని మోస్తరుగా వర్షం కురిసింది.

తైక్వాండో పోటీలపై కార్యాచరణ



సమావేశంలో తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది కాలంలో నిర్వహించతలపెట్టిన తైక్వాండో పోటీలపై ఉమ్మడి చిత్తూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిపట్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో తైక్వాండో క్రీడాభివృద్ధి, క్రీడాకారులకు శిక్షణ, సెమినార్స్ నిర్వహణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ధనంజయులు, ట్రెజరర్ శ్రీనివాసులు, శంకర్, వాసుదేవాచారి, రవి, వెంకటరమణ, సురేష్, సంతోష్, లోకేశ్, గౌతమ్, పృథ్వి, విజయ్, అనిల్ పాల్గొన్నారు.

బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడిగా సతీష్‌కుమార్



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): భారతీయ మజ్దూర్‌సంఘ్ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా ఆకుల సతీష్‌కుమార్ నియమితులయ్యారు. స్థానిక కచ్చపి ఆడిటోరియంలో సంఘ్ 70వ వార్షికోత్సవం ముగింపు సభ ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథ్ జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. ఆకుల సతీష్‌కుమార్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక కావడం పట్ల పలువురు అభినందించారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



రాజ్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఓ యవకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే జీఆర్ పోలీసుల వివరాల మేరకు... సైదాపురం మండలం తూర్పుపూండ్ల గ్రామానికి చెందిన రాజ్‌కుమార్(26) వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. ఆదివారం గూడూరు రైల్వేస్టేషన్ ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌పై అస్సాం నుంచి చెన్నై వెళుతున్న ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. రైల్వే జీఆర్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సుబ్బయ్య(70) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... పట్టణంలోని అగ్రహారపేటలో నివాసం ఉంటున్న సుబ్బయ్య శనివారం రాత్రి పాత వెంకటగిరి రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఆదివారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం ఇచ్చారు. సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సుబ్బయ్య మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి బంధువులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





రైల్వేస్టేషన్‌లో పడమర వైపు నిర్మించిన భవనం ● ప్రారంభించ నిరుపయోగంగా ఉన్న టిక్కెట్ బుకింగ్ కౌంటర్

నిరుపయోగంగా రైల్వే టిక్కెట్ కౌంటర్

నిర్మాణం పూర్తయి నాలుగేళ్లయినా ప్రారంభానికి నోచుకోని భవనం ● అసాంఘిక కార్యకలాపాలకు నెలవు

గూడూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గూడూరు రైల్వేస్టేషన్ ఆవరణలో పడమర వైపు ఉన్న టిక్కెట్ బుకింగ్ కౌంటర్ నిరుపయోగంగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. గూడూరు రైల్వేస్టేషన్ జంక్షన్ కావడంతో విజయవాడ, చెన్నై, తిరుపతి మార్గాల్లో సుమారు 65కు పైగా ప్యాసింజర్, మెమూ, ఎక్స్‌ప్రెస్ రైళ్లు గూడూరు మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. కాలక్రమేణా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో స్టేషన్‌కు తూర్పు వైపున ఉన్న టిక్కెట్ కౌంటర్ వద్ద రద్దీ నెలకొనేది. పట్టణంలో పడమర వైపు నుంచి వచ్చే ప్రయాణికులు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారాలను దాటుకుని తూర్పు వైపు ఉన్న కౌంటర్ వద్దకు వచ్చి టిక్కెట్‌లు తీసుకోవాల్సి ఉండేది. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించిన రైల్వేశాఖ నాలుగేళ్ల క్రితం స్టేషన్ పడమర వైపు నూతనంగా టిక్కెట్ బుకింగ్ కౌంటర్ భవనాన్ని నిర్మించింది. అయితే ఇప్పటి వరకు ఆ భవనం వినియోగంలోకి రాలేదు. ప్రారంభానికి నోచుకోకుండా నిరుపయోగంగా ఉండడంతో అసాంఘిక కార్యకాలపాలకు నెలవుగా మారుతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి నూతనంగా టిక్కెట్ బుకింగ్ కౌంటర్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.



అపరిశుభ్రంగా ఉన్న బుకింగ్ కౌంటర్ ఆవరణ

వెంకటరెడ్డి లేనిలోటు టీడీపీకి తీర్చలేనిది: సోమిరెడ్డి



వెంకటరెడ్డికి నివాళలర్పిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

డక్కిలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ పోలంరెడ్డి వెంకటరెడ్డి లేని లోటు టీడీపీకి తీర్చలేనిదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం డక్కిలి మండలంలోని మాటుమడుగు గ్రామంలో పోలంరెడ్డి వెంకటరెడ్డి వర్ధంతి జరిగింది. ఆయనకు నివాళులర్పించిన అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ వెంకటరెడ్డి లాంటి నాయకులు ఉండబట్టే వెంకటగిరి టీడీపీకి కంచుకోటగా నిలుస్తోందన్నారు. తాను 1987లో కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్‌గా ఉన్నప్పుడు, వెంకటరెడ్డి సొసైటీ అధ్యక్షుడుగా తనతో కలిసి పనిచేశామని, అప్పటి నుంచి ఆయన తుదిశ్వాస వదిలేవరకు తమ అనుబంధం కొనసాగిందని గుర్తుచేసుకున్నారు. వెంకటరెడ్డికి నివాళలర్పించిన వారిలో నెల్లూరు జిల్లా సెంట్రల్ బ్యాంకు చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు జన్ని రమణయ్య, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరాందాస్ గంగాధర్, వెంకటగిరి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద, వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, డక్కిలి మాజీ జడ్పీటీసీ సభ్యులు ఏలేశ్వరం రామచంద్రయ్య, నాయకులు డక్కిలి చంద్రారెడ్డి, మస్తాన్ నాయుడు, పప్పు చంద్రమౌళి రెడ్డి, దిలీప్, దండవోలు వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు ఉన్నారు.

కోటమ్మకు పూజలు



కోట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు నగదు అందజేస్తున్న పగడాల శివ, హంసా పృథ్వి

నాయుడుపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు వారి విద్యాభ్యాసం కోసం బలిజ సంఘ ఆర్థిక సాయం అందిస్తుందని ఆ సంఘ అధ్యక్షుడు పగడాల శివప్రదీప్, కార్యదర్శి హంసా పృథ్వీ తెలిపారు. నాయుడుపేటలో పగడాల ప్రదీప్ కార్యాలయం వద్ద ఆదివారం ఓజిలి మండలానికి చెందిన పుల్లా హాసినీ విద్యాభ్యాసం కోసం రూ.9వేల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు హంసా రామారావు, నీలం హరికృష్ణ పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.4.28 కోట్లు లభించింది. శనివారం 82,367 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

ముత్యాలమ్మకు పొంగళ్లు

చిల్లకూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించారు. ప్రత్యేక అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యానగర్‌లో ఎన్‌బీకేఆర్ వర్ధంతి



బాలకృష్ణారెడ్డి విగ్రహం వద్ద డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి వర్ధంతి ఆదివారం జరిగింది. విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న బాలకృష్ణారెడ్డి కాంస్య విగ్రహానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు, బోధనేతర సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

15న సామూహిక వరలక్ష్మీవ్రతం

తిరుపతి(జీవకోన), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నరసింహాచార్య, బాబుస్వామి, తులసీ రామశర్మ తెలిపారు. కరకంబాడీ రోడ్డులోని అట్లాంటిస్ స్కూల్ పక్కన ఉన్న పుష్పగిరి మఠంలో సాయంత్రం 4గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ శ్రావణమాసంలో వరలక్ష్మీవ్రతం ఎంతో ప్రాశస్త్యమైందని, అందరికీ లక్ష్మీ కటాక్షం కలగాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 9441661212, 7659927777, 9949339851, 9550595916, 9701553046, 9849120030లను సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి జిల్లాస్థాయి క్రీడల ఎంపిక పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం, హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నుంచి వివిధ క్రీడాంశాల జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ ఆదివారం తెలిపారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, హాకీ, వాలీబాల్ క్రీడలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఎస్వీయూ, శ్రీనివాస క్రీడా సముదాయం, ఎస్వీ ఆర్ట్స్ హాకీ, ఓల్డ్ ఏజీఎస్ కాలేజీ గ్రౌండ్‌లలో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. 22 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండి ఆధార్, ఏదైనా గుర్తింపు కార్డుతో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ హిందూజ (7095636012), కబడ్డీ, ఖోఖో గోపి(9059606346), వాలీబాల్, బాక్సింగ్ యహజాజ్(9177234298), బాస్కెట్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్ సాయిసుమతి(7780124037), ఆర్చరీ - వినోద్ (8919295921), హాకీ - శ్రీలక్ష్మీకరుణ(7032018113)లను సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగదు: యూటీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

తిరుపతి(విద్య), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తీసుకొచ్చి ఇబ్బంది పెట్టడం తగదని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. యూటీఎఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం తిరుపతిలోని ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యాబోధనకు ఆటంకంగా ఉన్న అన్ని యాప్‌లను రద్దు చేయాలన్నారు. యాప్‌ల వల్ల బోధన సక్రమంగా జరగడం లేదని విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టదన్నట్లు వ్యవహరించడం సరికాదన్నారు. నాణ్యమైన విద్య అందించడానికే విద్యారంగ సంస్కరణలు అని చెప్పారని, కానీ అవి పాఠశాలలను, ఉపాధ్యాయుల సంఖ్యను కుదించడానికే ఉపయోగపడుతున్నాయని అన్నారు. కర్మయోగి, పీ4 ద్వారా పిల్లలను దత్తత తీసుకోవాలని ఉపాధ్యాయులను ఒత్తిడి చేయడం ఏంటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రెండు నెలలుగా ఉపాధ్యాయులకు జీతాలు అందించకపోవడం బాధాకరమన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను తక్షణం నియమించాలని, నాలుగు డీఏలను, ఇతర బకాయిలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు దండు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా కార్యదర్శులు సురేష్, పద్మజ, రాష్ట్ర కౌన్సిలర్ నాగరాజు పాల్గొన్నారు.

రోడ్లపై పారుతున్న మురుగునీరు

వాహనచోదకులు, పాదచారుల అవస్థలు



పాత వెంకటగిరి రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలుచోట్ల మురుగునీరు రోడ్లపై పారుతోంది. ప్రధానంగా పాత వెంకటగిరి రోడ్డు వద్ద డ్రైనేజీ కాలువ పొంగి రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండటంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ కాలువలో పూడిక సరిగా తీయడంతో మురుగునీరు పొర్లి రోడ్లపైన ప్రవహిస్తోంది. మున్సిపాలిటీ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టి మురుగునీరు రోడ్లపై పారకుండా చూడాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

సిరామిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

గూడూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ సిరామిక్ కళాశాలలో ఈ నెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి మిగిలిన 12 సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9912342070, 8985348925 నెంబర్లను సంప్రదించాలన్నారు.

శివకుమార్‌కు సన్మానం



శివకుమార్ దంపతులను సన్మానిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఎస్వీయూ సెనేట్ హాల్లో ఓఆర్ఐ - శ్రీకృష్ణదేవరాయ సత్సంగ్ సంయుక్తంగా శివకుమార్ దంపతులను ఆదివారం సన్మానించాయి. ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, అవధాని మేడసాని మోహన్ తదితరులు పాల్గొని బాల సాహిత్యానికి గంగిశెట్టి చేసిన కృషిని కొనియాడారు. ఆయన యూనివర్సిటీ పూర్వ విద్యార్థి కావడం గర్వకారణమన్నారు. ఓఆర్ఐ డైరెక్టర్ పీసీ వేంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. డాక్టర్ తొండాటి రాజశేఖర్ వందన సమర్పణ చేశారు. రిటైర్డు ప్రొఫెసర్లు చిత్రాజు గోవిందరాజు, జక్కంపూడి మునిరత్నం, కోసూరి దామోదర నాయుడు, ఆనంద నాయుడు, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, రిటైర్డు లైబ్రేరియన్ వల్లువార్ షణ్ముగం, ఏనుగు అంకమ నాయుడు, గంగిశెట్టి శివకుమార్ సాహిత్యంపై పీహెచ్‌డీ చేసిన డాక్టర్ రామలింగయ్య, రచయితలు రాసాని, జిల్లేళ్ల బాలాజీ, కృష్ణస్వామిరాజు, మూరిశెట్టి గోవిందు, తోట వెంకటేశ్వర్లు, మల్లేశ్వరరావు, పేరూరు బాలసుబ్రహ్మణ్యం, డీన్లు నరసింహ, బాలాజీ పాల్గొన్నారు.

తొమ్మిది ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఒకరి అరెస్టు



స్మగ్లర్‌ను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఖాజీపేట సమీపంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. 9 ఎర్రచందనం దుంగలను, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం ఎఫ్‌బీవో లింగానాయక్‌తో కలిసి శనివారం రాత్రి నుంచి ఖాజీ పేట పరిధిలో కూంబింగ్ నిర్వహించారు. పత్తూరు సమాధులు చేరుకునే సరికి ఒక కారులో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు లోడ్‌చేస్తూ పోలీసుల కంటపడ్డారు. చుట్టుముట్టే ప్రయత్నం చేయగా ఒకరు దొరికారు. మిగిలిన వారు పారిపోయారు. అతను తమిళనాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కారులో లోడ్ చేసిన 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాహనంతో సహా దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యంరాజు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వర్షాలు కురవాలని గంగమ్మకు పూజలు


పొంగళ్లు పెడుతున్న మహిళలు

కేవీబీపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓళ్లూరులో గ్రామస్థులు ఆదివారం వర్షాల కోసం గంగమ్మ తల్లికి పూజలు చేశారు. పంటలు బాగా పండి గ్రామం అభివృద్ధి చెందాలని గ్రామస్థులు ఆకాంక్షించారు. పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి


శంకర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని సత్యవేడు టీడీపీ నియోజకవర్గ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి తెలిపారు. పుత్తేరి, పిల్లేటివారికండ్రిగ, ఆలత్తూరు, వీఎస్‌పురం పంచాయతీల్లో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. శంకర్‌రెడ్డిని నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ కన్నయ్యనాయుడు, యాచంద్రనాయుడు, మునిచంద్రనాయుడు, రవినాయుడు, మధునాయుడు, బట్టా రమేష్‌యాదవ్, బద్ర, రాజేంద్ర, భూపయ్య, గురవయ్య పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



శ్రీకాళహస్తి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగు యువత నాయకులు, మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలోఆదివారం ఘనంగా స్నేహితుల దినోత్సవం జరిగింది. స్నేహితులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. వంకాయల సిద్ధులయ్య, సుజిత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో తిరుణాళ్ల సందడి


కొత్తగొల్లకండ్రిగలో అంబళ్లు పోస్తున్న భక్తులు

పిచ్చాటూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కొత్త గొల్లకండ్రిగలో అంకాళపరమేశ్వరి తిరుణాళ్ళలో భాగంగా ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి అంబళ్లు పోసి పొంగళ్లు పెట్టారు. రెప్పాలపట్టు లో కొత్త నాంచారమ్మ తిరుణాళ్లలో పొంగళ్లు పెట్టి ఉత్సవాన్ని ప్రారంభించారు. అడవి కొడియంబేడులో గంగమ్మజాతర ఉత్సవంలో భాగంగా ఆదివారం గ్రామ పులి మేరలో శాస్త్రోక్తంగా చాటింపు వేశారు. ఈ గ్రామంలో గతంలో తిరుణాళ్ళలో గొడవలు జరిగాయన్న కారణంతో 25 ఏళ్లుగా ఉత్సవం జరుపుకోలేదు. యువకులు ముందుకొచ్చి గ్రామ పెద్దలతో మాట్లాడి జాతర ప్రారంభించారు. ఆదివారం కృత్తిక, శ్రీకృష్ణాష్టమి వస్తుండడంతో తిరుణాళ్ళను ఈ వారమే ప్రారంభించారు.

పుత్తూరు వార్తలు

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం


సింగల్ విండో ఛైర్మన్ కుమార్‌కు ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

వడమాలపేట,ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రైతులకు అన్నివిధాల సహాయపడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గాలి. భానుప్రకాష్ అన్నారు. ఆదివారం వడమాలపేటలో ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘం ఛైర్మన్ భూచంద్ర ప్రసాద్ (కుమార్) ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవికి వన్నె తెస్తూ అందరికి న్యాయం చేయాలని సూచించారు. డీసీసీబీ ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా సహకర బ్యాంకు రైతులకు స్వల్ప వడ్డీతో రుణసాయం అందిస్తుందని చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా లో సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. వడమాలపేట సింగల్ విండో ఛైర్మన్‌గా భూచంద్రప్రసాద్(కుమార్) సభ్యులుగా టీసీ అగ్రహారానికి చెందిన వెంకటరమణ, బట్టీకండ్రిగకు చెందిన పొన్నయ్ రాజు లకు ధ్రువపత్రాలను అందజేశారు. అంతకు ముందు క్రాంతి వీధిలో రూ.26 లక్షలతో నిర్మించిన సిమెంట్‌రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురళీధర్ రెడ్డి, ధనంజయులు నాయుడు, దాముయాదవ్, ఉమాపతి, డిల్లీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గజ వాహనంపై కల్యాణ వీరభద్రస్వామి



నారాయణవనం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): టీటీడీ అనుబంధగా ఉన్న భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారు గజవాహనంపై ఊరేగారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. 9.30 గంటలకు స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం గజ వాహనంపై ఊరేగించారు. ఏఈవో రవి, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

భక్తుల రద్దీ క్రమబద్ధీకరణపై శిక్షణ

పుత్తూరు,ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాలలో భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడం, ఇతర సేవలు అందించేందుకు 250 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం అర్జునుడి తపస్సుమాను, శనివారం రథోత్సవం, ఆదివారం అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొంటారన్నారు. తొక్కిసలాటలు జరుగకుండా చూడడం, భక్తులకు తాగునీరందించడం, వైద్య సేవలు అందించడంలాంటి విషయాల్లో సూచనలు చేశామన్నారు. స్కౌట్ మాస్టర్ అశోక్, రేంజర్ లీడర్ శైలజ,యువశ్రీలు పాల్గొన్నారు

యాలి వాహనంపై ఊరేగిన ధర్మరాజుల స్వామి



పుత్తూరు టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోనిద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి పులి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం భక్తులు వివిధ వేషధారణలలో అలరించారు. సాయంత్రం ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి యాలి వాహనంపై ఊరేగారు. ఉభయదారులుగా బెస్త కుల సంఘం వారు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులకు సాల్వాకం కృష్ణప్ప మొదలి, మాజీ ఛైర్మన్, యగందర్, సభ్యులు మునిచంద్ర, దామోదరం, కేశవ, బెస్త సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నిత్యాన్నదానానికి విరాళం


విరాళం అందజేస్తున్న రామకృష్ణ

శ్రీకాళహస్తి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కాకినాడ జిల్లా చేబ్రోలుకు చెందిన వంశీ రామకృష్ణ ఆదివారం రూ.51,116 విరాళంగా ఇచ్చారు. ఆలయ అధికారులు ఈ విరాళం స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి నీలకంఠేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులోని అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. 4న అంకురార్పణ, ధ్వజారోహణం, 5న తిరునాళ్ల సూర్యప్రభ వాహనం, 6న మూడవ తిరునాళ్ల చంద్రప్రభ వాహనం, 7న నాలుగవ తిరునాళ్ల చిలుక వాహనం, 8న కేతిగం ఉత్సవం, రాత్రి నంది సేవ, 9న రాత్రి రథోత్సవం, 10న ఉదయం కేడిగం, రాత్రి కల్యాణోత్సవం, గజ వాహన సేవ, 11న పార్వేట ఉత్సవం, గుంటకిందిపల్లి, జింగిలి పాళెం గ్రామాలకు చప్పరం ఉత్సవం, 12న తీర్థవారి ధ్వజావరోహణం, రాత్రి చప్పరం, 13న పల్లకీసేవ, ఏకాంత సేవ జరుగుతాయని వివరించారు.

అతిగా మద్యం తాగి యువకుడి మృతి


మురళి మృతదేహం

శ్రీకాళహస్తి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అధికంగా మద్యం తాగి ముత్యాలు అలియాస్ మురళి(25) అనే యువకుడు మృతి చెందాడు. శ్రీకాళహస్తి సీఐ గోపి కథనం మేరకు పట్టణంలోని ప్రాజెక్టు వీధికి చెందిన మురళి ఓ హోటల్‌లో పారిశుధ్య కార్మికుడుగా పనిచేస్తుంటాడు. నిత్యం తప్పతాగి రోడ్లపై పడిపోయేవాడు. శనివారం పూటుగా తాగి బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో రోడ్డుపై పడిపోయి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. ఆదివారం పోలీసులు మురళి శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు తప్పవు

శ్రీకాళహస్తి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బహిరంగ మద్యం తాగితే చర్యలు తప్పవని సీఐ గోపి హెచ్చరించారు. పట్టణంలోని తుపాను సెంటర్ వద్ద బహిరంగ ప్రదేశంలో చెత్త, మద్యం సీసాలను శుభ్రం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బహిరంగంగా మద్యం తాగితే తీసుకునే చర్యలను వివరించారు. ఈ ప్రాంతంలో రోజూ పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

ఒకే రాత్రి రెండిళ్లలో చోరీ

వరదయ్యపాలెం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలంలో ఒకే రోజు రాత్రి రెండిళ్ళలో చోరీ జరిగింది. ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న జల వనరుల శాఖ ఏఈ బాబు శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలసి కింద గల ఇంటికి తాళం వేసి, పైన ఉన్న ఇంట్లో నిద్రిస్తునానరు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగుల గొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం చూడగా బీరువాలోని 5 సవర్ల బంగారు నగలు, 50 వేలు నగదు చోరీ జరిగిందని ఏఈ బాబు తెలిపారు. వరదయ్యపాళెం పంచాయతీ బీసీ కాలనీలో విశ్రాంత బీఎస్ఎన్ఎల్ అధికారి రాజు కొన్ని రోజులుగా అమెరికాలో కుమార్తె ఇంట ఉంటున్నారు. ఆదివారం ఉదయం ఆయన ఇంటికి తాళం తీయడంతో పక్కనే నివాసం ఉంటున్న వ్యక్తికి అనుమానం వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు విచారిస్తున్నారు.

వీఆర్‌కు తొట్టంబేడు ఎస్‌ఐ రామాంజనేయులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు ఎస్‌ఐ రామాంజనేయులును వీఆర్‌కు పంపారు. సంబంధంలేని కేసుల్లో విచారణ చేస్తున్నారంటూ ఈయనపై శుక్రవారం అభియోగాలు వచ్చాయి. ఈయన వ్యవహార శైలిపై పలువురు టీడీపీ నేతలు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. శనివారం శనివారం అధికారులు విచారణ చేపట్టారు. శనివారం రాత్రి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ వీఆర్‌కు పంపుతూ నిర్ణయం తీసుకున్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం: వైసీపీ

పిచ్చాటూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ నిర్వహిస్తున్న బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పిచ్చాటూరు మండలంలో జరిగిన కార్యక్రమంలో సత్యవేడు వైసీపీ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలుచేయలేదన్నారు. నేతలు బీరేంద్రరాజు, .భాస్కర్‌నాయుడు, చలపతిరాజు పాల్గొన్నారు.

కనువిందు చేసిన కూచిపూడి నృత్యం



తిరుమల, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం ముందున్న నాదనీరాజనం వేదికపై ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులకు కనువిందు చేసింది. తిరుపతికి చెందిన కుమారి భానుజ బృందం ఈ ప్రదర్శన ఇచ్చింది. శ్రీమన్నారాయణ, అన్ని మంత్రములు.., వంటి అన్నమయ్య కీర్తనలకు వీరి బృందం అద్భుత నృత్య భంగిమలతో చూపరులను ఆకట్టుకున్నారు. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం కుమార్తె శ్రేయ జోషే తన ప్రదర్శనతో భక్తులను ఆకట్టుకున్నారు.

రాచగున్నేరి చెరువుకు మోక్షం

ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపు


రాచగున్నేరి చెరువులో తొలగించిన ఆక్రమణలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రాచగున్నేరి చెరువుకు కబ్జాదారుల నుంచి మోక్షం లభించింది. ఈ చెరువులో గత వైసీపీ హయాంలో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా కబ్జా చేశారు. ఒక వైపున శ్రీకాళహస్తి-తిరుపతి జాతీయ రహదారికి ఆనుకుని ఉండటం, మరో వైపున భారీ ప్రైవేటు పరిశ్రమ ఉండటంతో కబ్జాదారులు ఈ భూమిని ఆక్రమించేశారు. దుకాణాలు, అద్దె గదులను నిర్మించారు. కొందరు వైసీపీ నేతలు కబ్జా చేసిన స్థలాలను అమాయకులకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఐదేళ్ల నుంచి గ్రామస్థులు చెరువు భూమిని కబ్జాదారుల చెర నుంచి కాపాడాలంటూ పోరాటం సాగించారు. నాటి పాలకులు స్పందించకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.



ఆక్రమణలపై ఆంధ్రజ్యోతి కథనం

ఏడాదిన్నర క్రితం ఎన్నికల ముందు మళ్లీ ఆక్రమణలు జోరందుకోవడంతో మరోసారి న్యాయస్థానానికి ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరునెలల పాటు చొరబాటుదారులు చెరువు భూమి వైపు కన్నెత్తి చూడలేదు. గత ఏడాది డిసెంబరు 23న కొందరు ఆక్రమణకు తెగించారు. ఏకంగా మట్టితో రోడ్డు ఏర్పాటుకు ప్రయత్నం చేశారు. గ్రామస్థులు ఎదురు తిరగడంతో కబ్జాకు అడ్డుకట్టపడింది. ఆ సమయంలో దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి స్పందించి చెరువుభూమిని పరిశీలించి ఆక్రమణలు అరికట్టాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. తరువాత కొన్నాళ్లు సమస్య సద్దుమణిగింది. ఈఏడాది మేలో మళ్లీ కొందరు రోడ్డు పక్కన ఉన్న చెరువు భూమిని కబ్జా చేశారు. దీనిపై కూడా ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సీరియస్‌గా పరిగణించారు. చెరువు భూమిని కాపాడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పదిరోజుల క్రితం రికార్డులను పరిశీలించి ఆదివారం భారీ యంత్రాలతో సుమారు 20 అక్రమ నిర్మాణాలను తొలగించారు. మరికొన్నింటిని తొలగించి రికార్డు ప్రకారం ఉన్న 11ఎకరాలచెరువు భూమిని కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

ప్రోత్సహిస్తే పామోలిన్ సాగుతో లాభాలు


రవాణాకు సిద్ధంగా ఉన్న పామోలిన్

కేవీబీపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో పామోలిన్ పంట లాభాలు తెచ్చిపెడుతోంది. సుమారు వంద ఎకరాల మెట్ట భూములో రైతులు డిప్ ఇరిగేషన్ ద్వారా ఈ పంట సాగు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి డ్రిప్ ఇరిగేషన్ ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, ఓసీ, బీసీలకు 90శాతం సబ్సిడీ ఇస్తోంది. ప్రైవేటు సంస్థలు రంగంలోకి దిగి రైతులకు సూచనలిస్తూ పంట ఉత్పత్తులను కూడా కొనుగోలు చేస్తున్నాయి. ఆయిల్ పరిశ్రమలు దరిదాపుల్లో లేకపోవడంతో తమిళనాడులోని సేలం, పశ్చిమగోదావరిలోని ద్వారక తిరుమలలోని పరిశ్రమలకు పంటను రవాణా చేస్తున్నారు. అయితే తమకు రవాణా భారంగా తయారైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడవ సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది. ఎకరాకు 10 నుంచి 15 టన్నుల ఏపు వస్తుంది. సంవత్సరానికి టన్ను రూ.15వేలు వచ్చినా ఎకరాకు రూ.1.50లక్షలు ఆదాయం చేకూరుతుందని అధికారులు అంచనా. గత ఏడాదితో పోల్చితే ఈ యేడాది ధర తగ్గిందని రైతులు చెబుతున్నారు. గత యేడాది టన్ను రూ.21వేలు ఉండగా ప్రస్తుతం రూ.18,600 లభిస్తోంది. తమకు ప్రోత్సాహమిస్తే ఈ పంటపై మరింత ఆసక్తి పెరుగుతుందని రైతులంటున్నారు. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయడానికి అవకాశం ఉంటుందని చెబుతున్నారు. పెట్టుబడి పెద్దగా పెట్టనవసరంలేదు. కూలీల ఇబ్బంది ఉండదు. మొస్తరు ఎరువులతో వీలున్న ఈ సాగుపై ఆసక్తి కలిగిన రైతులు తమను సంప్రదిస్తే వివరాలను తెలియజేస్తామని ఉద్యాన శాఖ అధికారులు చెప్పారు.

శాకాహారంపై అవగాహన ర్యాలీ



శ్రీకాళహస్తి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మరాజుల ఆలయం నుంచి జ్ఞాన ప్రసూనాంబ పిరబిడ్ ధ్యాన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం శాకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శాకాహారం వలన కలిగే ఉపయోగాలను వివరిస్తూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం ముక్కంటి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ధ్యానులు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కుదాం.. ఆరోగ్యంగా ఉందాం


అవగాహన కల్పిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సైకిల్ తొక్కుతూ ఆరోగ్యంగా ఉందామని పోస్టల్ ఉద్యోగులు ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వారంలో ఒకరోజు మోటారు వాహనాలను పక్కన పెట్టి సైకిల్ తొక్కడం అలవాటు చేసుకోవాలన్నారు. దీని వల్ల కాలుష్యం తగ్గడంతో పాటు ఆరోగ్యంగా ఉంటామని పేర్కొన్నారు.

మంత్రి సత్యకుమార్‌కు నేతల స్వాగతం


మంత్రికి స్వాగతం పలుకుతున్న తుడా ఛైర్మన్, బీజేపీ నాయకులు

రేణిగుంట ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం లభించింది. ఆదివారం మధ్యాహ్నం జిల్లా పర్యటనలో భాగంగా విజయవాడ నుంచి తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలాఆనంద్, జిల్లా అధక్షుడు సామంచి శ్రీనివాస్, బీజేపీ నాయకులు డాక్టర్ శ్రీహరి, మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ రెడ్డి, కుర్రకాలువ వేణు, రాజా రాయల్, నరేష్ రాయల్ తదితరులు స్వాగతం పలికారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి క్రీడల ఎంపిక పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం, హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నుంచి వివిధ క్రీడాంశాల జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, హాకీ, వాలీబాల్ క్రీడలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఎస్వీయూ, శ్రీనివాస క్రీడా సముదాయం, ఎస్వీ ఆర్ట్స్ హాకీ, ఓల్డ్ ఏజీఎస్ కాలేజీ గ్రౌండ్‌లలో పోటీలు జరుగుతాయని వెల్లడించారు. 22 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండి ఆధార్, ఏదైనా గుర్తింపు కార్డుతో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ హిందూజ(7095636012), కబడ్డీ, ఖోఖో గోపి(9059606346), వాలీబాల్, బాక్సింగ్ యహజాజ్(9177234298), బాస్కెట్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్ సాయిసుమతి(7780124037), ఆర్చరీ - వినోద్ (8919295921), హాకీ- శ్రీలక్ష్మీకరుణ(7032018113)లను సంప్రదించాలని కోరారు.

తిరుమలలో కర్ణాటక గవర్నర్

తిరుమల, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఆదివారం తిరుమలకు వచ్చారు. పద్మావతి అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ ఓఎస్డీ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు.

ప్రారంభానికి సిద్ధమవుతున్న పోలీస్‌స్టేషన్ భవనం


ముస్తాబవుతున్న రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ నూతన భవనం

శ్రీకాళహస్తి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండవ పట్టణపోలీస్ స్టేషన్ భవనం ఎట్టకేలకు ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఇక్కడి 17 ఏళ్ల క్రితం ఏర్పడిన ఈ పోలీస్‌స్టేషన్ అద్దె భవనాల్లోనే కొనసాగుతోంది. గతంలో పట్టణానికి దూరంగా తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం వద్ద అద్దెభవనాల్లో ఉండటంపై మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఈ సమస్యపై స్పందించి పట్టణంలోని త్రిశూలాంబ గుడి పక్కన ఉన్న పోలీసుక్వార్టర్స్ వద్ద రెండవ పోలీస్‌స్టేషన్ భవనం నిర్మించేందుకు కృషి చేశారు. నిధులు కూడా మంజూరయ్యాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కానీ నిర్మాణ పనులను పర్యవేక్షించే నాథుడు లేడు. బిల్లుల చెల్లింపులో కూడా తీవ్రజాప్యం జరిగింది. దాంతో వైసీపీ పాలనలో నిర్మాణం అరకొరగానే మిగిలిపోయింది. ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డి గెలుపొందాక ఈ భవన నిర్మాణానికి అడ్డంకులను తప్పించారు. ఫలితంగా తుదిదశకు చేరుకుని ప్రారంభానికి ముస్తాబవుతోంది.